ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
శనివారం 6 ఏప్రిల్ 2024

సమస్యల స్పాట్

పది మూల్యాంకన కేంద్రంలో కనీస సౌకర్యాలు కరువు

తాగునీటికీ ఇబ్బందులే..

చాలినన్ని డెస్కులూ లేని వైనం



వరండాలో మూల్యాంకనం



డెస్కుల కొరతతో స్పాట్‌లో కింద కూర్చున్న ఉపాధ్యాయిని

కొత్తచెరువు, ఏప్రిల్ 5: జిల్లాలో పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకన కేంద్రంలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. అసౌకర్యాల నడుమే ఉపాధ్యాయులు స్పాట్ విధులకు హాజరవుతున్నారు. కొత్తచెరువులోని బాలుర జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 1వ తేదీ నుంచి మూల్యాంకనం ప్రారంభమైంది. స్పాట్‌కు హాజరయ్యే ఉపాధ్యాయులు, సిబ్బంది కోసం వసతుల కల్పనలో విద్యాశాఖ అధికారులు విఫలమయ్యారన్న విమర్శలున్నాయి. ఎండవేడిమితో విపరీతమైన దాహం వేస్తుంది. మూల్యాంకనకేంద్రంలో తాగునీరు కూడా సరిగా అందుబాటులో ఉండట్లేదని ఉపాధ్యాయ వర్గాలు వాపోతున్నాయి. ఉదయం కొన్ని వాటర్ క్యాన్లు ఉంచి వదిలేస్తున్నారు. ఆ నీరు మధ్యాహ్నానికే అయిపోతోంది. భోజన సమయంలో తాగునీటి కోసం బయట నుంచి వాటర్ బాటిళ్లు కొనుగోలు చేయాల్సి వస్తోందని టీచర్లు వాపోతున్నారు. మూల్యాంకన కేంద్రంలో సరిపడా డెస్కులు లేకపోవడతో కింద కూర్చుని మూల్యాంకనం చేస్తున్నారు. మరికొంతమంది ఉక్కపోతను భరించలేక వరండాలో మూల్యాంకనం నిర్వహిస్తున్నారు. భోజనం చేయడానికి కూడా బల్లలు లేకపోవడంతో నేలపైనే కుర్చుని చేస్తున్నామని మూల్యాంకనానికి వచ్చిన ఉపాధ్యాయులు వాపోతున్నారు.



ఇంటి నుంచి భోజనం తెచ్చుకుని తింటున్న ఉపాధ్యాయులు

సమసమాజ స్థాపకుడు జగ్జీవన్ రామ్

కలెక్టర్ అరుణ్‌బాబు



జగ్జీవన్ రామ్ చిత్రపటం వద్ద జ్యోతి వెలిగిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి, ఏప్రిల్ 5: సమసమాజ స్థాపకుడు మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ అని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు పేర్కొన్నారు. అటువంటి మహనీయుడి ఆశయాలను భావితరాలకు అందించడమే నిజమైన నివాళి అన్నారు. జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని స్థానిక కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం ఉదయం ఆయన చిత్రపటానికి కలెక్టర్ నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డీఆర్వో కొండయ్య, సాంఘిక సంక్షేమ శాఖాధికారి శివరంగప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, సెరికల్చర్ జేడీ పద్మావతి, హార్టికల్చర్ అధికారి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జగ్జీవన్ రామ్ జీవితం.. యువతకు ఆదర్శం: ఎస్పీ



జగ్జీవన్ రామ్ చిత్రపటం ముందు జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి రూరల్: బాబూ జగ్జీవన్ రామ్ అనుసరించిన ఆదర్శాలు, చూపిన సంస్కరణ మార్గాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా ఎస్పీ మాధవరెడ్డి పేర్కొన్నారు. జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా పుట్టపర్తిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఎస్పీ పూలమాలు వేసి, నివాళి అర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుడిగా, సంఘసంస్కర్తగా, తొలి దళిత ఉపప్రధానిగా తన పరిపాలనా దక్షతతో అఖండ భారతావనికి జగ్జీవన్ రామ్ విశేష సేవలు అందించారని కొనియాడారు. అణగారినవర్గాల అభ్యున్నతికి పోరాడిన యోధుడిగా చరిత్రపుటల్లో నిలిచారన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ విష్ణు, ఆర్‌ఐ మహబూబ్‌వలి, స్పెషల్‌బ్రాంచ్ సీఐ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, ఎస్బీ ఎస్‌ఐ ప్రదీప్‌కుమార్, జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రచండ ఎండలు

- వడగాల్పులతో జనం ఉక్కిరిబిక్కిరి
- జిల్లాలో 41.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- మరో మూడురోజులు ఇదే పరిస్థితి
- వడదెబ్బపై కనిపించని అవగాహన కార్యక్రమాలు

ఉదయం వడగాలులు

జిల్లాలో ఉదయం నుంచి భానుడు ప్రతాపం చూపుతున్నాడు. దీంతో ఎండలు మండిపోతున్నాయి. దీనికి వడగాలులు తోడవుతున్నాయి. వెరసి ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 వరకు ఎండలు తగ్గడం లేదు. ఈ పరిస్థితుల్లో ఎడాపెడా విద్యుత్ కోతలు విధిస్తుండడంతో ఇళ్లలో ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఇప్పుడే ఎండలు ఇంత తీవ్రంగా ఉంటే.. రానున్న రోజుల్లో ఇంకెంత దారుణంగా ఉంటాయో నని జనం ఆందోళన చెందుతున్నారు.



కొత్తచెరువులో ఎండ వేడిమికి నిత్యం రద్దీగా ఉన్న ప్రాంతం బోసిపోయిన దృశ్యం

భగ్గుమంటున్న భానుడు

కొత్తచెరువు, ఏప్రిల్ 5: భానుడు ఉగ్రరూపాన్ని ప్రదర్శిస్తున్నాడు. నిప్పులు కురిపిస్తున్నాడు. ఎండలు పెరగడంతోపాటు వడగాలులు వీస్తుండడంతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. శుక్రవారం 41.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావడం గమనార్హం. ఎన్నడూలేని విధంగా ఉష్ణోగ్రత్తలు పెరుగుతుండటంతో ఎండ వేడిమితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వివిధ పనుల నిమిత్తం పట్టణ ప్రాంతాలకు వచ్చేవారు ఉదయం వేళల్లోనే వచ్చి వెంటనే పనులు చూసుకుని ఇంటిదారి పడుతున్నారు. దీంతో నిత్యం రద్దీగా ఉండే మండలంలోని నాలుగురోడ్ల కూడలి జనంలేక బోసిపోయింది. అక్కడక్కడా కొంతమంది చెట్లకింద సేదతీరుతూ కనిపించారు. వాస్తవానికి వేసవి కాలంలో ఏప్రిల్, మేనెలల్లో ఎండలు తీవ్రంగా ఉంటాయి. ఈ ఏడాది ఏప్రిల్ ప్రారంభంలోనే ఎండలు తీవ్రంగా ఉండడం గమనార్హం. ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి. వాతావరణంలో మెనుమార్పులే ఇందుకు కారణమని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. ఎన్నికల ప్రచారం, విద్యార్థుల పరీక్షలు, వివాహ వేడుకలు పెద్దఎత్తున జరుగుతుండటంతో వాటికి హాజరయ్యే వారు అవస్థలు పడుతున్నారు.



పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

జిల్లాలో వారం రోజులుగా 40 డిగ్రీలకు పైనే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ నెల 1న 39.5 డిగ్రీలు, 2న 40 డిగ్రీలు, 3న 40.8 డిగ్రీలు, 4న 41డిగ్రీలు, 5న 41.3 డిగ్రీలు నమోదు కావడం గమనార్హం. మరో మూడు రోజులు ఉష్ణోగ్రత్తలు పెరిగి వడగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు సూచిస్తున్నారు. అత్యవసరమైతేనే బయటకు రావాలనీ, తరచూ నీరు తాగాలనీ, ఎండలో తిరిగితే డీహైడ్రేషన్‌కు లోనై వడదెబ్బకు లోనయ్యే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఎండలోవెళ్లాల్సి వస్తే తలకు టోపీ, రుమాలు ధరించడంతోపాటు గొడుగు వెంట తీసుకెళ్లాలని సూచిస్తున్నారు.

ఇవీ జాగ్రత్తలు



ఇంట్లో వాతావరణం చల్లగా ఉండేవిధంగా చూసుకోవాలి. పండ్లరసాలు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ, నిమ్మరసం తాగడం మంచిది. రోజుకు 4 నుంచి 5 లీటర్ల మంచినీరు తాగాలి. ఒంటికి వదులుగా ఉండే దుస్తులు ధరించాలి. ఆహారంలో తగినంత ఉప్పు, నీరు పోషక విలువలు ఉండేలా చూసుకోవాలి. పిల్లలు, వృద్ధులపై ఎండ ప్రభావం పడకుండా చూసుకోవాలి.

అవగాహన కార్యక్రమాలేవీ?



వైద్య శాఖ ద్వారా ప్రజలకు వడదెబ్బపై అవగాహన కల్పించాల్సి ఉంది. కొన్నిప్రాంతాల్లో మాత్రమే వైద్యసిబ్బంది.. ఉపాధి కూలీలు, ప్రజలకు వడదెబ్బపై అవగాహన కల్పిస్తున్నారు. మిగిలిన చోట్ల అవగాహన కల్పించకపోవడంతో వడదెబ్బ బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇప్పటికైనా వైద్య శాఖ ఉన్నతాధికారులు వడదెబ్బపై అవగాహన కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.



కదిరిలో ఎవ్వరినీ నమ్మలేని స్థితిలో అభ్యర్థి

- సొంతపార్టీ నాయకులపై నజర్!
- ఖర్చు పెట్టేందుకు వెనుకంజ
- బంధువర్గంపైనే ఆధారపడుతున్న వైనం

కదిరి వైసీపీ అభ్యర్థి మగ్బూల్ అహ్మద్

వైసీపీలో అనుమానం

కదిరి

నియోజకవర్గ వైసీపీలో సొంతవారిపైనే అనుమానాలు మొదలైనట్లు విశ్వసనీయ సమాచారం. ప్రస్తుతం ఉన్న నాయకులు పార్టీ విజయానికి కృషి చేస్తారా, లేదా అన్న దానిపై వైసీపీ అభ్యర్థి మగ్బూల్ అహ్మద్ బేరీజు వేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఎవ్వరినీ నమ్మలేని స్థితిలో ఉన్నట్లు తెలిసింది. వైసీపీ అభ్యర్థి తన బంధువర్గంపైనే ఆధారపడినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో నాయకులను నమ్మి ఖర్చులు పెట్టుకుంటే ఫలితాలు తారుమారైతే పరిస్థితి ఏమిటని మదనపడుతున్నట్లు చర్చ సాగుతోంది. ప్రస్తుతం నాయకుల మధ్య విభేదాలు తారస్థాయికి చేరాయన్నది బహిరంగ రహస్యమే. ఇటీవలే వైసీపీలో చేరిన ఓ నాయకుడు తొలిరోజునుంచే ప్రత్యేక వర్గంగా రాజకీయాలు నడుతున్నట్లు సమాచారం.

సొంత పార్టీ వారిపై నజర్

వైసీపీ అధిష్టానం మగ్బూల్ అహ్మద్‌కు కదిరి టిక్కెట్ కేటాయించింది. ఆ మేరకు ఆయన బరిలో దిగారు. పూర్తిస్థాయి రాజకీయాల్లో లేకపోవడం కారణంగా కదిరి ప్రాంతంలో ఏ నాయకుడు, ఏమేర బలం కలిగి ఉన్నాడో అంచనా వేయలేని స్థితిలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ కారణంతో ఉన్న నాయకులపై అంతర్గతంగా చర్చలు కొనసాగిస్తున్నట్లు సమాచారం. కొంతమంది నాయకులు టిక్కెట్ ఆశించి భంగపడిన వారుంటే, మరికొంతమంది ఇతర పార్టీలో భంగపడి వైసీపీలో చేరి ఇక్కడ చక్రం తిప్పాలని ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ఇంకొంతమంది ద్వితీయశ్రేణి నాయకులు.. అభ్యర్థి అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని తమకు తోచిన సలహాలిస్తూ, తాము చెప్పినట్లు చేయాలని ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. మరికొంతమంది అభ్యర్థి వద్ద డబ్బు కూడా డిమాండ్ చేసినట్లు చర్చ సాగుతోంది. ఈ గందరగోళంలో అభ్యర్థి పూర్తిస్థాయిలో నాయకులపై నమ్మకం ఉంచలేకపోతున్నట్లు తెలిసింది. ఎవరిని నమ్మితే ఏం జరుగుతుందోనని మదనపడుతున్నట్లు సమాచారం. తాను టిక్కెట్ కోసం ఇక్కడ ఉన్న నాయకులపై ఆధారపడలేదనీ, అధిష్టానం నుంచే నేరుగా తెచ్చుకున్నాననీ, ఈ నేపథ్యంలో ఎవరిని ఎంత మేర నమ్మాలో అంత వరకే నమ్ముతానన్నట్లు తెలిసింది. గతం నుంచి రాజకీయాలు చేస్తున్న నాయకులను చూసి కూడా కొంత హుషారు పడినట్లు సమాచారం.




నమ్మి ఖర్చు పెట్టలేని స్థితి

కదిరి వైసీపీలో నాయకుల మధ్య విభేదాలు తారస్థాయికి చేరాయి. ఇటీవల ముఖ్యమంత్రి పర్యటనలో కూడా బస్సులోకి తాము ఎక్కాలంటే కాదు, తామంటూ వాగ్వాదం చేసుకున్నట్లు తెలిసింది. తలుపుల మండలానికి చెందిన ఓ నాయకుడు కడప జిల్లాలో ఉన్న సంబంధాలతో బస్సుపైకి ఎక్కడం చర్చనీయాంశమైంది. దీనిపై పలువురు నాయకులు తీవ్రస్థాయిలో నిందించినట్లు తెలిసింది. అంతకు ముందు ఇద్దరు నాయకులు మంత్రి ఎదుట వేదికపైనే సీటుకోసం వాదులాడుకున్నారు. ఇటీవల వైసీపీలో చేరిన ఓ నాయకుడు తొలిరోజు నుంచే తనకంటూ వర్గాన్ని ఏర్పాటు చేసుకున్నట్లు తెలిసింది. 24వ వార్డులోని వైసీపీ వర్గీయులు.. అభ్యర్థి మగ్బూల్‌ను కాదని ఇటీవల పార్టీలో చేరిన నాయకుడి వెంట ఉన్నట్లు సమాచారం. ఈనేపథ్యంలో వైసీపీ కార్యకర్తలను నమ్మలేని స్థితిలో అభ్యర్థి ఉన్నాడు.

వైసీపీని వీడుతున్న నాయకులు

వైసీపీలో పరిణామాలు, స్థానిక నాయకత్వం, విభేదాలతో పలువురు నాయకులు ఇప్పటికే వైసీపీని వీడిపోయారు. ఐదుగురు కౌన్సిలర్లు.. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. గాండ్లపెంట మండలానికి చెందిన సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు వెంటరమణారెడ్డి, అదే మండలంలో ఎంపీటీసీతోపాటు సర్పంచ్ సుధాకర్ తదితరులు వైసీపీని వీడారు. పట్టణ మాజీ అధ్యక్షుడు బాహుద్దీన్ ఇటీవల టీడీపీలో చేరారు. ఇలా రోజూ వైసీపీని వీడి టీడీపీలో చేరుతూనే ఉన్నారు. తనకల్లు మండలంలో పలువురు ముఖ్య నాయకులతోపాటు కదిరి పట్టణంలో మరో ముగ్గురు కౌన్సిలర్లు వైసీపీని వీడేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిసింది. కదిరిలో పార్టీ పరిస్థితి రోజురోజుకీ దిగజారుతుండడంపై వైసీపీ అధిష్టానం గందరగోళంలో పడినట్లు సమాచారం.



దాహం తీర్చరూ..

రొళ్ల, ఏప్రిల్ 5: మండలంలోని బి.జి.హళ్లి గ్రామంలోని ఇందిరమ్మ కాలనీ మహిళలు తాగు నీటి సమస్యపై ఆందోళన బాటపట్టారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ముందు శుక్రవారం ఖాళీ బిందెలతో బైఠాయించి, నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ.. స్థానికులు కొంతమంది ఇళ్లలోకి అక్రమ కొళాయిలు వేసుకొన్నారనీ, దీంతో ఎగువ ప్రాంతంలో ఉన్నవారికి నీరు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సమస్యను పరిష్కరించి, నీరు సరఫరా చేయాలని కోరారు. విషయం తెలుసుకున్న గ్రామ కార్యదర్శి శ్రీనాథ్ ఫోన్‌లో ఆందోళనకారులతో మాట్లాడారు. కొత్తబోరు వేయించి, సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వారు శాంతించి, వెళ్లిపోయారు.



నిరసన తెలుపుతున్న బీజీ హళ్లి ఇందిరమ్మ కాలనీ మహిళలు

నీటి కోసం.. పొలంబాట..!

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 5: మండలంలోని గంగిరెడ్డిపల్లిలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. నీటి కోసం గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో రెండు తాగునీటి పథకం బోర్లున్నాయి. ఒక బోరులో భూగర్భ జలమట్టం పడిపోయింది. మరో బోరులో నీరు పుష్కలంగా ఉన్నా.. విద్యుత్ సౌకర్యం లేదు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితంలేదు. ఇటీవల ఖాళీ బిందెలతో మహిళలు ఆందోళన చేపట్టారు. అప్పట్లో రెండు, మూడురోజుల్లో సమస్య పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. తాగునీటి పథకం వద్ద సర్వీసు వైర్లు తీసుకొచ్చి పెట్టారే తప్ప.. ఇంతవరకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదు. దీంతో గ్రామస్థులు వ్యవసాయ బోర్లను ఆశ్రయించాల్సి వస్తోంది. విద్యుత్ సరఫరా ఉన్నపుడు వెళ్లి నీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొందని గ్రామస్థులు వాపోతున్నారు. అధికారులు స్పందించి, తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.



వ్యవసాయ బోరు నుంచి నీటిని తెచ్చుకుంటున్న గ్రామస్థులు

ఉష్ణోగ్రతలు (శుక్ర)

	గరిష్ఠం	కనిష్ఠం
పుట్టపర్తి	40.0	24.0
కదిరి	40.0	24.0
ధర్మవరం	41.0	25.0
హిందూపురం	39.0	23.0
పెనుకొండ	40.0	24.0

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సెహరీ
పుట్టపర్తి	6.35 శనివారం (సాయంత్రం)	4.58 ఆదివారం (ఉదయం)
కదిరి	6.32 శనివారం (సాయంత్రం)	4.55 ఆదివారం (ఉదయం)
ధర్మవరం	6.37 శనివారం (సాయంత్రం)	4.52 ఆదివారం (ఉదయం)
హిందూపురం	6.35 శనివారం (సాయంత్రం)	4.56 ఆదివారం (ఉదయం)
పెనుకొండ	6.34 శనివారం (సాయంత్రం)	4.54 ఆదివారం (ఉదయం)

నకిలీ అధికారులొచ్చారు..!

- ముదిగుబ్బలో హల్‌చల్.. ఫుడ్ సేఫ్టీ అధికారులమంటూ తనిఖీలు..
- తినుబండారాల దుకాణం నుంచి డబ్బు వసూలు..
- పోలీసులకు బాధితుడి ఫిర్యాదు



ముదిగుబ్బ, ఏప్రిల్ 5: మండల కేంద్రంలో నకిలీ అధికారులు హల్‌చల్ చేసిన విషయం శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఫుడ్ సేఫ్టీ అధికారులమంటూ టోకరా వేసి, దుండగులు డబ్బు దండుకున్నారు. పోలీసుల వివరాల మేరకు.. స్థానిక అనంతపురం రోడ్డులో తినుబండారాల వ్యాపారం చేసుకునే ప్రవీణ్‌కుమార్ వద్దకు గురువారం మధ్యాహ్నం ముగ్గురు వ్యక్తులు కారులో వచ్చారు. తాము ఫుడ్‌సేఫ్టీ అధికారులమనీ, తనిఖీలకు వచ్చామని షాపు యజమానిని నమ్మించారు. గడువు ముగిసిన సరుకు అమ్ముతున్నావంటూ బెదిరించారు. రూ.25 వేలు జరిమానా వేస్తున్నామన్నారు. కేసు లేకుండా వదిలేస్తామని చెప్పి రూ.12 వేలు తీసుకుని, కారులో వెళ్లిపోయారు. కొద్దిసేపటికి అనుమానం వచ్చిన ప్రవీణ్‌కుమార్ జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రామచంద్రకు ఫోన్ చేసి, ఆరాతీశారు. తమ డిపార్ట్‌మెంట్ తరఫున ఎవరూ తనిఖీలకు రాలేదనీ, ఎవరో దుండగులు వచ్చి ఉంటారని ఆయన చెప్పారు. మోసపోయానని తెలుసుకున్న షాపు యజమాని ప్రవీణ్‌కుమార్ శుక్రవారం ముదిగుబ్బ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ యతీంద్ర కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు. అందులో భాగంగా కొందరు అనుమానితులను అదుపులోకి తీసుకుని, విచారిస్తున్నట్లు తెలిసింది.

మొరాయించిన ఆర్టీసీ బస్సు



కరిదాసనపల్లి సమీపంలో నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు

అగళి, ఏప్రిల్ 5: మండల కేంద్రం నుంచి మడకశిరకు బయల్దేరిన ఆర్టీసీ బస్సు కరిదాసనపల్లి సమీపాన శుక్రవారం మొరాయించింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం 4.30 గంటల సమయంలో బస్సు ఆగిపోయింది. తిరిగి స్టార్ట్ కాకపోవడంతో వేరే బస్సులో ప్రయాణికులు వెళ్లిపోవాల్సి వచ్చింది. బస్సుల కండీషన్ నిర్వహణలో ఆర్టీసీ నిర్లక్ష్యం మూలంగానే తాము ఇబ్బందులు పడాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోయారు.

వాడుకుని వదిలేసిన వైసీపీ..!

- టీడీపీ వైపు ఎమ్మెల్సీ ఇక్బాల్ చూపు
- అధికార పార్టీకి.. పదవికి రాజీనామా



హిందూపురం, ఏప్రిల్ 5: ఎమ్మెల్సీ పదవికి, వైసీపీ సభ్యత్వానికి మహ్మద్ ఇక్బాల్ శుక్రవారం రాజీనామా చేశారు. పోలీసు శాఖలో రాయలసీమ ఐజీ స్థాయిలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన ఆయన వైసీపీలో చేరారు. ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ ఆయనను వాడుకుని వదిలేశారు. దీంతో మన స్తాపం చెందిన ఇక్బాల్.. మూడేళ్ల పదవీకాలం ఉన్నా ఎమ్మెల్సీ పదవికి, వైసీపీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. 2018లో పదవీ విరమణ అనంతరం వైసీపీలో చేరిన ఇక్బాల్.. పార్టీ విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్తగా వ్యవహరించారు. అనూహ్య పరిణామాల మధ్య గత ఎన్నికల్లో హిందూపురం అభ్యర్థిగా బరిలోకి దిగారు. టీడీపీ అభ్యర్థి బాలకృష్ణ చేతిలో ఓడిపోయారు. ఆ తరువాత పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తూ.. ఎమ్మెల్సీ పదవి దక్కించుకున్నారు. కానీ గత యేడాది జూలైలో ఆయనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా దీపికను హిందూపురం నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించారు. అప్పటి నుంచి ఆయన అసమ్మతితో ఉన్నారు. వైసీపీ నాయకుడు చౌళూరు రామకృష్ణారెడ్డి హత్య తరువాత వైసీపీలో పరిణామాలు ఆయనకు వ్యతిరేకంగా సాగాయి. ఈ క్రమంలో ఆయనకు ఈసారి ఎమ్మెల్యే టిక్కెట్ లభించలేదు. ఇక పార్టీలో ఉండీ ప్రయోజనం లేదని భావించిన ఇక్బాల్.. ఎమ్మెల్సీ పదవికి, పార్టీకి రాజీనామా చేశారు. ఆయన టీడీపీ వైపు చూస్తున్నట్లు సమాచారం. ఎలాంటి షరతులు లేకుండా త్వరలో టీడీపీలో చేరుతారని ఆయన వర్గీయులు అంటున్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

చెన్నేకొత్తపల్లి, ఏప్రిల్ 5: ఉగాదిపండుగ వేళ మండలంలోని న్యామద్దల గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన వీరనారమ్మ(45) శుక్రవారం విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందింది. పోలీసులు తెలిపిన మేరకు వీరనారమ్మ ఇంటిని శుభ్రం చేసుకుంటోంది. స్టూల్‌పై నిల్చుని ఇంటి గోడకు సున్నం వేస్తుండగా కరెంటు వైరు తగిలి షాక్‌కు గురై కింద పడింది. కుటుంబసభ్యులు ఆమెను చెన్నేకొత్తపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. వీరనారమ్మకు భర్త గంగన్నతోపాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఎస్సీ, ఎస్టీల జీవితాల్లో అంధకారం



- వైసీపీ హయాంలో ఒక్క సంక్షేమ పథకమూ అమలుకాని వైనం
- ఐదేళ్లలో ఒక్కరూపాయి విడుదల చేయని ప్రభుత్వం
- టీడీపీ హయాంలో భరోసా

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్5 : వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క నవరత్నాలు తప్పా... మిగిలిన సంక్షేమ పథకాలన్నీ అటకెక్కించి ఆయా వర్గాలకు తీరని అన్యాయమే జరిగింది. గత టీడీపీ ప్రభుత్వం పేద ఎస్సీ, ఎస్టీ ప్రజలకు కార్పొరేషన్ల ద్వారా ఉపాధికి భరోసా కల్పించింది. రూ. లక్ష నుంచి 10 లక్షల వరకూ రుణాలు అందించి ఎంతో మందికి దారి చూపింది. సొంతంగా వ్యాపారాలు చేసుకునే ఔత్సాహికుల కోసం ప్రత్యేకంగా రూ. 87 కోట్లకుపైగా ఖర్చు చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపిందనే చెప్పాలి. ఇన్నోవా, ఇతియోస్ కార్ల రూపంలో రుణాలు అదించింది. అయితే వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో ఒక్క రూపాయి నిధులు విడుదల చేయకుండా ఆయా కార్పొరేషన్లను దిష్టిబొమ్మల్లా మార్చేసిందని ఎస్సీ, ఎస్టీ వర్గాలు వాపోతున్నారు.

టీడీపీ హయాంలో అమలైన ఎస్సీ పథకాలు

ఎస్సీ కార్పొరేషన్ కింద గతంలో ఎన్నడూ లేని విధంగా 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం పలు పథకాల కింద ఎస్సీ లబ్ధిదారులకు రుణాలు, వాహనాలను అందించింది. ప్రధానంగా బ్యాంకు లింకేజీ రుణాల కింద ఐఎస్‌బీ(ఇండస్ట్రీ సర్వీసెస్ బిజినెస్) సొంతంగా వ్యాపార సముదాయాల ఏర్పాటు చేసుకునే 6,071 మంది లబ్ధిదారులకు రూ. 87.55 కోట్లు రుణాలను అందజేసింది. రూ. 5 లక్షలు రుణాల వారికి 40 శాతం సబ్సీడీ, రూ. 10 లక్షల్లోపు రుణాలు తీసుకున్న వారికి రూ. 35 శాతం సబ్సీడీని అందించింది. అదే విధంగా పశుసంవర్ధక పథకం కింద 3,992 మంది లబ్ధిదారులకు రూ. 40.16 కోట్లు రుణాలను అందించింది. రూ. 5 లక్షలు రుణాలు తీసుకున్న వారికి రూ. 40 శాతం సబ్సీడీ, రూ. 10 లక్షలోపు రుణాలు తీసుకున్న వారికి రూ. 35 శాతం సబ్సీడీతో రుణాలను అందించింది. మొత్తం రెండు పథకాలకు కలిపి రూ. 127.72 కోట్లు అందించింది. ఎన్ఎఫ్‌డీసీ పథకం కింద స్వయం ఉపాధి కోసం వాహనాలను కేటాయించింది. ఐదేళ్లలో 74 మంది లబ్ధిదారులకు ఇన్నోవా కార్లకు 35 శాతం సబ్సీడీతో రూ. 12.32 కోట్లు ఖర్చు చేసింది. అదే విధంగా 49 మంది లబ్ధిదారులకు ఇతియోస్ కార్లకు 35 శాతం సబ్సీడీతో రూ. 4.46 కోట్లు, 10 మంది లబ్ధిదారులకు ట్రాక్టర్లకు 35 శాతం సబ్సీడీతో రూ. 67 లక్షలు, 27 మంది లబ్ధిదారులకు ఆటోలకు 60 శాతం సబ్సీడీతో రూ. 53.75 లక్షలు, ఐఎస్‌బీ కింద 299 మంది లబ్ధిదారులకు రూ. లక్ష సబ్సిడీ చొప్పున రూ. 9.40 కోట్లు ఖర్చు చేసింది. మొత్తంగా ఎన్ఎస్ఎఫ్‌డీసీ పథకం కింద దాదాపు రూ. 27.39 కోట్లు ఖర్చు చేసింది. అదే విధంగా ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ పథకం కింద 9 మంది లబ్ధిదారులకు ట్రాక్టర్ల కోసం 35 శాతం సబ్సీడీతో రూ. 63 లక్షలు ఖర్చు చేసింది. అదే విధంగా ఐఎస్‌బీ కింద 50 మంది లబ్ధిదారులకు యూనిట్ కాస్ట్‌లను బట్టి 40, 35 శాతం సబ్సీడీలతో రూ. 1.43 కోట్లు ఖర్చు చేసింది. మొత్తంగా ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ పథకం కింద రూ. 2.06 కోట్లు ఖర్చు చేసింది.



ఎస్సీ,ఎస్టీ కార్పొరేషన్ల భవన సముదాయం

ఎస్టీ కార్పొరేషన్‌లో అమలైన పథకాలు..

ఎస్టీ(గిరిజన) కార్పొరేషన్ కింద గత టీడీపీ హయాంలో బ్యాంకు లింకేజ్ కింద 50 శాతం సబ్సీడీతో రుణాలను మంజూరు చేసింది. ఐదేళ్లలో దాదాపు 2125 మంది ఎస్టీ లబ్ధిదారులకు రూ. 32.43 కోట్లు మంజూరు చేయగా... అందులో రూ. 16.03 కోట్లు సబ్సీడీ రూపంలో ప్రభుత్వమే భరించింది. అదే విధంగా 13 మంది ఎస్టీ లబ్ధిదారులకు ఇన్నోవా, ఇతియోస్ కార్లను కేటగిరీల వారీగా సబ్సీడీలతో రూ. 94 లక్షలను అందించింది. ఎస్టీ వర్గాల్లో పేదరికంలో ఉంటూ వ్యవసాయానికి బోర్లు లేని వారిని 20 మందిని ఎంపిక చేసి డిగ్గింగ్ బోర్ వెల్స్ స్కీమ్ కింద 20 మంది లబ్ధిదారులకు రూ. 22.80 లక్షలు ఖర్చు చేసి బోర్లు వేయించింది. అదే విధంగా బోర్లు ఉండి కరెంటు సౌకర్యం లేని వారి కోసం ఎనర్జిసేషన్ ఆఫ్ ఎస్టీ బోర్ వెల్స్ పథకం కింద 690 మంది ఎస్టీ లబ్ధిదారులకు రూ. 6.62 కోట్లు ఖర్చు కరెంటు సౌకర్యాన్ని కల్పించింది. మొత్తం పథకాలకు సంబంధించి గడిచిన ఐదేళ్లలో అప్పటి టీడీపీ ప్రభుత్వం గిరిజన ప్రజల సంక్షేమం కోసం 2848 మంది లబ్దిదారులకు రూ.40.22 కోట్లను ఖర్చు చేసింది.

కార్పొరేట్ చదువుకు దూరమవుతున్న విద్యార్థులు..

టీడీపీ ప్రభుత్వంలో బీఏఎస్(బెస్ట్ అవాయిలబుల్ స్కీమ్) పథకం ఎస్సీ,ఎస్టీ పేద వర్గాల విద్యార్థులకు వరంలా మారిందనే చెప్పాలి. ఆ పథకం కింద ఎంతో మంది విద్యార్థులు కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యనభ్యసించి మెరుగైన ఫలితాలను సాధించారు. ఈ స్కీమ్‌ను జిల్లా వ్యాప్తంగా అర్హులైన ప్రతి ఒక్క ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు అమలు పరిచింది. అయితే వైసీపీ ప్రభుత్వం ఆ స్కీమ్‌ను ఎత్తేసింది. దీంతో ఆ స్కీమ్‌ను నమ్ముకొని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో విద్యనభ్యసించాలనుకునే విద్యార్థుల ఆశలు గల్లంతయయ్యాయనే చెప్పాలి. ఈ స్కీమ్ కింద 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ అర్హులైన విద్యార్థులకు సంబంధించి ఒక్కో విద్యార్థి ఫీజు రూ. 30 వేలు చొప్పున ఆయా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు ప్రభుత్వమే చెల్లిస్తూ వచ్చేది. దీంతో సామాన్యులకూ అత్యుత్తమ విద్య అందేది. ఉమ్మడి అనంత జిల్లాలో దాదాపు 6 వేలమందికిపైగా ఎస్సీఎస్టీ విద్యార్థులు ఈ పథకం కింద అర్హులై ప్రైవేట్, కార్పొరేట్ విద్యనభ్యసించారని అధికారిక గణాంకాలే చెబుతున్నాయి. అయితే వైసీపీ అధికారం చేపట్టాక ఐదేళ్లుగా స్కీమ్‌ను రద్దు చేయడంతో సంబంధిత పాఠశాలల యాజమాన్యాలు నిబంధనల మేరకు ఫీజులు చెల్లించండి... లేదంటే మీ పిల్లల టీసీలను తీసుకెళ్లాలంటూ ఒత్తిడి తెచ్చాయి. దీంతో విధిలేని పరిస్థితుల్లో ఆయా పాఠశాల నుంచి కొందరు బయటికి వచ్చి ప్రభుత్వ బడుల్లో చేర్పించగా... మరి కొందరు వారు చెప్పిన మేరకు రూ. వేలల్లో ఫీజులు చెల్లిస్తూ మిన్నకుండిపోతున్న పరిస్థితులు జిల్లాలో నెలకొన్నాయనడంలో ఎలాంటి సందేహం లేదు.



ఎస్సీ, ఎస్టీలను అణచివేశారు..

వైసీపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల ఎదుగుదలను పూర్తిగా అణచివేసింది. కార్పొరేషన్ రుణాలను ఆపి వేయడంతో ఎంతో మంది నిరుద్యోగులు ఉపాధి కోల్పోయారు. టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేయడంతో ఎస్సీ,ఎస్టీ నిరుపేదలు రోడ్డున పడ్డా రు. వారిని కూలీలుగానే ఉంచాలనే దురుద్దేశంతో ల్యాండ్ పర్చేజింగ్ స్కీమ్‌ను రద్దు చేసింది. ఎస్సీఎస్టీ కార్పొరేషన్ల కు నిధులే కుండా చేసిన ఘ నత సీఎం జగన్‌కే దక్కింది.



- సాకే హరి, ఎస్సీ,ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు

కార్పొరేషన్ల నిధులు మళ్లించారు..

ఎస్సీఎస్టీ కార్పొరేషన్లలో అమలయ్యే పథకాలను రద్దు చేసి... ఆ నిధులను నవరత్నాలకు ఎత్తుకెళ్లిన ఘనత జగన్‌కే దక్కుతుంది. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్క సబ్‌ప్లాన్ నిధులు పొందలేదంటే ఎస్సీ,ఎస్టీ వర్గాలు ఏం నష్టపోయాయో అర్థం చేసుకోవచ్చు. చంద్రబాబునాయుడు పరిపాలనలో గొర్రెల పెంపకం కోసం రుణాలు, చిన్న తరహాల పరిశ్రమల కోసం రుణాలు, ఏ ఆధారం లేని వారి కోసం రూ. 2 లక్షల యూనిట్ల రుణాలు ఇలా ఎంతో మంది లాభ పడ్డారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరవాత ఆ పథకాలన్నీ ఎత్తేసి వారికి మొండిచేయి చూపింది.



- ఉమామహేశ్వరీ, ఏపీ ఎరుకుల ప్రజా సంక్షేమసంఘం మహిళా అధ్యక్షురాలు

నెత్తురోడిన రోడ్లు

- వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి.. పలువురికి గాయాలు

జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందగా పలువురు గాయపడ్డారు. బెళుగుప్ప మండలం హనిమిరెడ్డిపల్లి సమీపంలో జరిగిన కారు ప్రమాదంలో తూర్పుగోదావరి జిల్లాకు చెందిన డాక్టర్ మృతి చెందగా, ఐదుగురు ఉపాధ్యాయులు గాయపడ్డారు. అనంతపురంలో జరిగే శుభాకార్యానికి వెళ్తున్న దంపతుల ద్విచక్రవాహనాన్ని కూడేరు సమీపలో స్కార్పియో ఢీకొనడంతో భర్త మృతి చెందగా భార్య తీవ్రంగా గాయపడింది. ఉరవకొండ మండలం బూదగవి వద్ద ఆటో బోల్తా పడి మిరప కోతకు వెళ్తున్న 11 మంది కూలీలు గాయపడ్డారు.

రెండు కార్లు ఢీ - ఒకరి మృతి

- ఐదుగురికి గాయాలు

బెళుగుప్ప, ఏప్రిల్ 5: మండలంలోని హనిమిరెడ్డిపల్లి గ్రామ సమీపంలో బ్రహ్మయ్య గుడి వద్ద శుక్రవారం ఉదయం రెండుకార్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. తూర్పుగోదావరి జిల్లా గన్నవరం మండలం నరేంద్రపురం గ్రామానికి చెందిన ఆయుర్వేద వైద్యులు నాగేశ్వర ప్రసాద్ కుటుంబ సభ్యులతో కలిసి కారులో రాయదుర్గం బయల్దేరాడు. అనంతపురంలో స్పాట్ వాల్యూయేషన్‌కు కళ్యాణదుర్గం నుంచి ఉపాధ్యాయులు తిప్పేస్వామి, రామశేఖర్, హరికృష్ణ, రామచంద్ర, తిప్పేస్వామి కలిసి కారులో బయల్దేరారు. హనిమిరెడ్డిపల్లి సమీపంలో నాగేశ్వరప్రసాద్ ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి ఎదురుగా వస్తున్న ఉపాధ్యాయుల కారును ఢీకొంది. తీవ్రంగా గాయపడిన నాగేశ్వరప్రసాద్ (71) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఉపాధ్యాయులు ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివ తెలిపారు.



నుజ్జునుజ్జయిన కారు



నాగేశ్వరప్రసాద్ (ఫైల్)

డీఈఓ పరామర్శ

అనంతపురం విద్య : ప్రమాదానికి గురై అనంతపురంలోని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న ఉపాధ్యాయులను డీఈఓ వరలక్ష్మి, గుత్తి డిప్యూటీ డీఈఓ శ్రీదేవి పరామర్శించారు. పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు వారిని పరామర్శించారు.



ప్రమాదంలో మృతి చెందిన జగన్నాథ్ రెడ్డి (ఫైల్)



ప్రమాదానికి కారణమైన స్కార్పియో వాహనం

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన స్కార్పియో

- భర్త మృతి, భార్యకు తీవ్ర గాయాలు

కూడేరు : బంధువుల శుభకార్యానికి ద్విచక్రవాహనంపై వెళ్తున్న దంపతులను ఓ స్కార్పియో వాహనం ఢీకొట్టింది. దీంతో భర్త అక్కడికక్కడే మృతి చెందగా, భార్య తీవ్రంగా గాయపడింది. మండలంలోని కల్లగళ్ల గ్రామానికి చెందిన జగన్నాథ్‌రెడ్డి(40) వాసవి దంపతులు ఓ శుభ కార్యానికి ద్విచక్ర వాహనంపై అనంతపురం బయల్దేరారు. కూడేరు సమీపంలోని అనంతవెంకటరెడ్డి కాలనీ వద్దకు రాగానే అనంతపురం నుంచి ఉరవకొండ వైపు వెళ్తున్న అతి వేగంగా వెళ్తున్న స్కార్పియో వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో జగన్నాథ్‌రెడ్డి(40) అక్కడికక్కడే మృతి చెందగా, భార్య వాసవి తీవ్రంగా గాయపడింది. ఆమెను 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో జరిగిన వెంటనే ద్విచక్ర వాహనం దగ్ధమైయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతుడు జగన్నాథ్‌రెడ్డి వ్యవసాయం చేసుకుంటూ ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. సంఘటన స్థలాన్ని పోలీసులు సందర్శించి, ప్రమాదానికి కారణాలను సేకరించారు.ఈ

కూలీలతో వెళ్తున్న ఆటో బోల్తా

- 11 మందికి గాయాలు

ఉరవకొండ : మండలంలోని బూదగవి వద్ద ఆటో బోల్తా పడి 11 మంది కూలీలు గాయపడ్డారు. విడపనకల్లు మండలం మలాపురం గ్రామానికి చెందిన కూలీలు మిర్చి పంట కోతకు ఆటోలో ఇంద్రావతికి బయల్దేరారు. బూదగవి వద్ద అడ్డు వచ్చిన గొర్రెలను తప్పించే క్రమంలో అదుపు తప్పి ఆటో బోల్తా పడింది. దీంతో ఆటోలో ఉన్న 11 మంది కూలీలు గాయపడ్డారు. క్షతగాత్రులను ఉరవకొండ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేశారు. కావేరి, రమేష్, అరుణ, నీలిమ, తనూజా, వన్నూరుస్వామి, రవితేజలను మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. నీలిమ, వరలక్ష్మి, శిల్ప, నాగమ్మ ఉరవకొండ ఆసుపత్రిలోనే చికిత్స పొందుతున్నారు. గాయపడిన వారిని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ఫోన్‌లో పరామర్శించారు.



ప్రమాదానికి గురైన ఆటో



తీవ్రంగా గాయపడిన మహిళ



ప్రచారంలో పాల్గొన్న ఆర్టీసీ కండక్టర్ వెంకటరమణారెడ్డి

ఎన్నికల ప్రచారంలో ఆర్టీసీ కండక్టర్

ధర్మవరంరూరల్, ఏప్రిల్ 5: మండలంలోని సుబ్బరావుపేట గ్రామంలో ఈ నెల 4వ తేదీ సాయంత్రం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కాగా ఈ ప్రచారంలో ధర్మవరం డిపోకు చెందిన ఆర్టీసీ కండక్టర్ గొట్లూరు వెంకట రమణారెడ్డి పాల్గొన్నారు. ఆయనది అదేగ్రామం కావడంతో ఎమ్మెల్యే వెంట తిరిగారు. ఈ ఫొటోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. అదేవిధంగా అదేగ్రామంలో వలంటీర్ జూటూరు కవిత కూడా ఎమ్మెల్యే వెంట తిరుగుతూ ప్రచారంలో పాల్గొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎన్నికల ప్రచారంలో పాల్గొనకూడదని ఈసీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అయినప్పటికీ ఇంకా కొంత మంది అధికారులు ఎన్నికల ప్రచారాల్లో పాల్గొంటూ స్వామి భక్తిని చాటుకుంటున్నారు.



వలంటీర్ జూటూరు కవిత

ఉపాధి కూలీల బకాయిలు రూ. 30 కోట్లు



- ఇతర పథకాలకు నిధులు మళ్లించిన వైసీపీ ప్రభుత్వం
- రెండు నెలలుగా ఎదురుచూపులు..

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 5 : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు చెల్లించాల్సిన బకాయిలు పేరుకుపోయాయి. రెండు నెలల నుంచి కూలీలకు చెల్లించాల్సిన సొమ్ము రూ.30కోట్ల వరకు పెండింగ్‌లో ఉంది. కాంట్రాక్టర్లకు, ఇతర పథకాలకు నిధులు మళ్లించడంతోనే ఉపాధి కూలీలకు బిల్లులు చెల్లించడం లేదనేది గట్టిగా వినిపిస్తోంది. ఓ వైపు ఉపాధి కూలీల బకాయిలు పేరుకుపోతున్నా... మరోవైపు డిమాండ్‌కు తగ్గట్టుగా కూలీలకు పనులు కల్పించడం లేదనేది ఉపాధి కూలీల నుంచి వినిపిస్తున్న మాట. పని అడిగినా పట్టించుకునే నాథుడే కరువయ్యారని ఉపాధి కూలీలు వాపోతున్నారు. తమ సొమ్ము ఇతర పథకాలకు ఎలా మళ్లిస్తారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



డ్వామా కార్యాలయం

ఎండలోనే పనులు..

ఉపాధి కూలీలకు సౌకర్యం కల్పించడంలోనూ ప్రభుత్వం విఫలమవుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో పనులు అడిగిన కూలీలకు సరిపడా పనులు కల్పించడం లేదు. వేసవిలో ఈ సమయానికి రోజుకు సుమారుగా 40వేలు పని దినాలు సగటున నమోదు కావాలి. అయితే ప్రస్తుతం అందుకు భిన్నంగా 20వేల పనిదినాలు మాత్రమే నమోదు చేస్తున్నారు. వేసవిలో ఉపాధి కూలీలకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించడం లేదు. ఇప్పటికే వేసవి అలవెన్సు నీడ, నీరు, మజ్జిగ సరఫరాను నిలిపివేశారు. రోజురోజుకు పెరిగిపోతున్న ఉష్ణోగ్రతలతో కనీస వసతులు లేక ఉపాధి కూలీలు సతమతమవుతున్నారు. మండే ఎండల్లోనే పనులు చేసి అనారోగ్యానికి గురవుతున్నారు.

త్వరలో బిల్లులు చెల్లిస్తాం

: వేణుగోపాల్ రెడ్డి, డ్వామా పీడీ



ఉపాధి కూలీల బిల్లులు బకాయి ఉన్న మాట వాస్తవమే. త్వరలో బిల్లులు చెల్లిస్తాం. ఉపాధి కూలీలు ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు. వేసవిలో కూలీలకు అడిగిన చోట స్థానికంగానే ఉపాధి పనులు కల్పించాలని సిబ్బందికి సూచించాం. ఓవైపు ఎన్నికల సమయంలో విధులు ఒత్తిడి ఉన్నా...కూలీలకు పనులు కల్పించడంలో ఎక్కడా నిర్లక్ష్యం చేయడం లేదు. క్షేత్రస్థాయిలో సిబ్బంది ఈ మేరకు ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశాం.



ఎండలోనే పని చేస్తున్న కూలీలు

వైసీపీకి గిర్రాజు నగేశ్ గుడ్‌బై

- చేనేత విభాగం రాష్ట్రప్రధాన కార్యదర్శి పదవికి కూడా ..
- పార్టీలో తగిన గుర్తింపు లేనందునే రాజీనామా

ధర్మవరం, ఏప్రిల్ 5: ధర్మవరంలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. ఆ పార్టీ ఆవిర్భావం నుంచి అందులోనే ఉండి పార్టీ బలోపేతానికి కష్టపడి పని చేసిన చేనేత వర్గానికి చెందిన గిర్రాజు నగేశ్ గుడ్‌బై చెప్పారు. వైసీపీ క్రియాశీలక సభ్యత్వంతో పాటు చేనేత విభాగం రాష్ట్ర ప్రధానకార్యదర్శి పదవికి కూడా రాజీనామా చేశారు. ఈ మేరకు పట్టణంలోని శమీనారాయణస్వామి ఆలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సుదీర్ఘకాలం కాంగ్రెస్ లో ఉన్న తాను వైసీపీ ఆవిర్భవించిన తరువాత ఆ పార్టీలోకి చేరి ధర్మవరంలో మొట్టమొదట జెండా కట్టానన్నారు. అప్పట్లో పార్టీని బలోపేతం చేయడంలో తన కృషి ఎంతుందో నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసన్నారు. బత్తలపల్లికి సీఎం జగన్ వచ్చినప్పుడు తనను కొందరు వ్యక్తులు కలవనీయకుండా అడ్డుపడ్డారని, ఈ ఘటన తనను ఎంతో బాధించిందని అన్నారు. తగిన గుర్తింపు లేనప్పుడు పార్టీలో ఉండకూడదని నిర్ణయించుకున్నానన్నారు. గతంలో జగన్ ధర్మవరానికి వచ్చినప్పుడు సభ జరుగుతుండగా.. అప్పుడు కాంగ్రెస్ లో ఉన్న ప్రస్తుత ఎమ్మెల్యే కేతిరెడ్డి కరెంటు లేకుండా చేశారన్నారు. ప్రస్తుతం వాళ్లే వైసీపీని ముందుండి నడిపించే పరిస్థితి దాపురించిందన్నారు. తానెప్పుడు పదవులు కోరుకోలేదని, చేనేతలు బాగుండాలనే ఆ పార్టీలో పని చేశానని అన్నారు. అయితే ధర్మవరానికి వచ్చి బీసీ అభ్యర్థి సత్యకుమార్‌ను కలిశానని, దీంతో తక్షణమే వైసీపీ గ్రూపులలో నా నంబర్‌నే తొలగించారని వాపోయారు. అంతేకాకుండా సత్యకుమార్ యాదవ్‌ను కలిసిప్పటి నుంచి తనకు బెదిరింపుకాల్స్ వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే వైసీపీకి రాజీనామా చేస్తున్నానన్నారు. త్వరలోనే తన సన్నిహితులతో చర్చించి ఏ పార్టీలో చేరేది నిర్ణయం తీసుకుంటానని ఆయన పేర్కొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న గిర్రాజు నగేశ్

చీనీ కాయలు టన్ను రూ.30వేలు

అనంతపురంరూరల్, ఏప్రిల్ 5: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీ కాయలు టన్ను గరిష్ఠంగా రూ.30వేలు, కనిష్ఠంగా రూ.14వేలు, సరాసరి రూ.20వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 560టన్నులు వచ్చాయన్నారు.



కాశిలోల్ల పల్లిలో ప్రచారం చేస్తున్న కందికుంట

ముమ్మరంగా కందికుంట ఎన్నికల ప్రచారం

కదిరి, ఏప్రిల్ 5: తలుపుల మండలం పొలతలవాండ్లపల్లి, కాశిలోల్లపల్లి, తురకవాండ్లపల్లి, వీరమల్లయ్యగారిపల్లి, దేవరపల్లి, నాయనగారిపల్లి గ్రామాల్లో శుక్రవారం టీడీపీ కూటమి అభ్యర్థి కందికుంట వెంకట ప్రసాద్ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరంగా నిర్వహించారు. ఆయనకు ప్రతిగ్రామంలోనూ మహిళలు హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. నాయకులు, కార్యకర్తలు గజమాలలతో సత్కరించారు. తర్వాత కందికుంట ఇంటింటికీ వెళ్లి ప్రజల్ని ఆప్యాయంగా పలకరిస్తూ సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు. వాటి వల్ల కలిగే ప్రయోజనాల గురించి గురించి తెలియజేశారు. చంద్రబాబు సీఎం అయితే అన్ని వర్గాల ప్రజలకు మేలు కలుగుతుందని చెప్పారు. ఎన్నికల్లో కూటమిని గెలిపించాలని కోరారు. మీ గెలుపు కోసం ఎదురు చూస్తున్నామని, ఈ సారి తప్పక గెలుస్తామని ఓ వృద్ధురాలు కందికుంటను ఆశీర్వదించిన తీరు అందరినీ ఆకట్టుకుంది. ప్రచారంలో జనసేన నాయకులు సత్యవతితో పాటు టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీకి కాలం చెల్లింది: మాజీమంత్రి పల్లె

- టీడీపీలోకి 40 కుటుంబాల చేరిక



డబురువారిపల్లెలో టీడీపీలో చేరినవారితో పల్లె రఘునాథరెడ్డి

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 5: రాష్ట్రంలో వైసీపీకి ఇక కాలం చెల్లిందని, ఆ పార్టీకి చమరగీతం పాడడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీమంత్రి పల్లె రఘునాథ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని డబురువారిపల్లిలో శుక్రవారం జయహో బీసీ సదస్సు జరిగింది. కార్యక్రమం ప్రారంభానికి ముందు డబ్బురువారిపల్లి పంచాయతీలోని 40 కుటుంబాల వారు నాయకుడు శివారెడ్డి ఆధ్వర్యంలో వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. వారికి పల్లె కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. అవినీతి, అక్రమాలు పెరిగిపోయాయన్నారు. 3,500మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. చంద్రబాబు అధికారంలోకి వస్తేనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందన్నారు. బీసీల సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. కనుక ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిని గెలిపించాలని కోరారు. అవినీతి వైసీపీని సాగనంపాలని పిలుపునిచ్చారు. అలాగే కొండకమర్ల గ్రామంలోని కొత్త మసీదు వద్ద ముస్లింమైనార్టీలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పల్లె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ముస్లింల సంక్షేమానికి చంద్రబాబు పెద్దపీట వేశారని గుర్తు చేశారు. మైనార్టీల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమన్నారు. అనంతరం ఉపవాస దీక్షలున్న ముస్లింలకు పల్లె భోజనం వడ్డించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జయచంద్ర, జడ్పీటీసీ మాజీ పిట్టా ఓబులరెడ్డి, జనసేన మండల కన్వీనర్ మేకల ఈశ్వర్, సర్పంచ్ శంకర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, మాజీ కన్వీనర్ రాజారెడ్డి, నాయకులు పీట్ల సుధాకర్, మండోజీ ఆర్ఫిఖాన్, బోపల్లి శివారెడ్డి, తుమ్మల మహబూబ్‌బాషా, గంటా శ్రీనివాసులు, బీసీసెల్ అంజనప్ప, ఎద్దుల నారాయణరెడ్డి, తెలుగుయువత బూదిలి ఓబులరెడ్డి, ఎస్సీ సెల్ బడిశం రామాంజనేయులు, జిల్లా నాయకులు జాకీర్ అహమ్మద్, పొగాకుషానవాజ్, గండికోట ఇర్ఫాద్, కొండే ఈశ్వరయ్య, గంగాధర్, సురేష్, షబ్బీర్, షామీర్, జెరిపిటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పోతులకుంటపల్లిలో మాట్లాడుతున్న పల్లె సింధూరా రెడ్డి

పల్లె సింధూర విస్తృత ప్రచారం

- గ్రామాల్లో ప్రజలకు మినీమేనిఫెస్టోపై అవగాహన

కొత్తచెరువు, ఏప్రిల్ 5: మండలంలోని పోతులకుంట, మరుకుంటపల్లి, మల్లెంపల్లి గ్రామాలలో శుక్రవారం టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూరారెడ్డి ఎన్నికల ప్రచారాన్ని జోరుగా చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ తిరిగి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ.. మినీమేనిఫెస్టో పథకాల గురించి వివరించారు. వాటి వల్ల కుటుంబంలో ఎవరెవరికి ఏయే పథకాలు వర్తిస్తాయి. ఏ మేరకు లబ్ధి చేకూరుతుందో వెల్లడించారు. చంద్రబాబు సీఎం అయితే ఈ పథకాలన్నీ వెంటనే అమలవుతాయని పేర్కొన్నారు. గత ఐదేళ్లలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి నియోజవర్గ అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. ఆస్తులను కూడబెట్టుకోవడానికే ఆయనకు సమయం సరిపోయిందని విమర్శించారు. వచ్చే ఎన్నికలలో శ్రీధర్‌రెడ్డికి ఓటుతో బుద్ధి చెప్పాలని, టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిని అఖండ మెజారిటీతో గెలిపించాలని ప్రజల్ని కోరారు. ప్రభుత్వం పింఛన్లను ఆలస్యంగా పంపిణీచేయడం వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందని, నిధులు విడుదల చేయకుండా వైసీపీ ప్రభుత్వం ప్రతిపక్షాలపై నింద వేస్తోందని ఈ సందర్భంగా ఆమె అన్నారు. వీటిని ప్రజలు గమనించి వచ్చే ఎన్నికలలో వైసీపీకి గుణపాఠం చెప్పాలని అన్నారు. కార్యక్రమంలో పల్లెవెంకట కృష్ణకిశోర్‌రెడ్డి, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు జయహో బీసీ

కదిరిఅర్బన్, ఏప్రిల్ 5: పట్టణంలోని చౌడేశ్వరీ దేవికల్యాణమండపంలో శనివారం టీడీపీ ఆధ్వర్యంలో జయహో బీసీ కార్యక్రమం జరగనుందని, బీసీలందరూ పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పార్టీ మండల కన్వీనర్ చెన్నకేశవులు శుక్రవారం ప్రకటనలో పిలుపునిచ్చారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరగనుందన్నారు. మండలంలోని బీసీలందరూ పాల్గొనాలని కోరారు.

కావమ్మ, మారెయ్య తిరునాళ్లకు అంకుర్పారణ

నంబులపూలకుంట, ఏప్రిల్ 5: మండలకేంద్రానికి సమీపంలోని కొత్తరోడ్డు వద్ద వెలసిన కావమ్మ, మారెయ్య ఆలయం వద్ద జరిగే తిరునాళ్లకు గురువారం అంకుర్పారణ చేశారు. ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర మైనార్టీ కార్యవర్గ సభ్యుడు బాబ్‌జాన్ హాజరై ఆలయానికి రూ.పది వేలు వితరణ చేశారు. అనంతరం పూజారులు ఆలయ సమీపంలో ధ్వంజస్తంభం ఏర్పాటు చేసి, ప్రత్యేక పూజలతో తిరునాళ్లకు అంకురార్పణ చేశారు. కార్యక్రమంలో ఆలయ పూజారి శ్రీధర్, నాయకులు రమణ, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

'సీఎస్, డీజీపీని ఎన్నికల విధుల నుంచి తొలగించాలి'

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 5: రాష్ట్రంలో ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు ముందస్తుగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీలను వెంటనే ఎన్నికల విధుల నుంచి తొలగించాలని టీడీపీ జిల్లా అధికారప్రతినిధి వల్లపు సోమశేఖర్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి, డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు వీరిని ఎన్నికల విధులనుంచి తొలగించాలని కోరారు.

మృతుడి కుటుంబానికి పల్లె పరామర్శ

నల్లమాడ, ఏప్రిల్ 5: మండలంలోని చౌటకుంటపల్లి గ్రామానికి చెందిన నాయనోరుపల్లి ఉత్తప్ప(65) గురువారం అనారోగ్యంతో రాత్రి మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి శుక్రవారం గ్రామానికి వెళ్లి అతడి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. పల్లె వెంట నాయకులు చందనబాబు, పద్మనాభరెడ్డి, రమణారెడ్డి, నాగరాజు, కార్యకర్తలు ఉన్నారు.

వాహనాల తనిఖీ

గాండ్లపెంట, ఏప్రిల్ 5: మండలంలోని రెక్కమాను వద్ద ఉన్న కదిరి-రాయచోటి ప్రధానరహదారిపై శుక్రవారం ఎస్ఐ కృష్ణవేణి సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల దృష్ట్యా.. ఎవరైనా అక్రమంగా డబ్బు, మద్యం, ఇతర సామగ్రి తరలిస్తారేమోనన్న అనుమానంతో ముందస్తుగా తనిఖీలు చేపట్టామన్నారు. అలాగే తనిఖీలో పట్టుబడిన వస్తువులకు తప్పకుండా బిల్లులుండాలని, లేనిచో వాటిని సీజ్ చేస్తామని హెచ్చరించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

కదిరిఅర్బన్, ఏప్రిల్ 5: అక్రమంగా నిలువ ఉంచిన కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ మోహన్ తెలిపారు. శుక్రవారం ఆయన తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన కారు డ్రైవర్ పాలగిరి నౌషాద్ కర్ణాటకలోని చిక్‌బళ్లాపూర్ పట్టణంలోని రవి వైన్స్‌నుంచి మద్యం కొనుగోలుచేసి, పట్టణానికి సమీపంలోని మదరపల్లి రోడ్డులో గల అమీర్ ఫర్నీచర్ దుకాణంలో నిలువ ఉంచేవాడన్నారు. ఇలా 56కేసులు మద్యాన్ని నిలువ ఉంచాడన్నారు. తమకు వచ్చిన సమాచారం మేరకు శుక్రవారం అమీర్ ఫర్నీచర్ దుకాణంలో దాడులు చేసి, నిలువ ఉంచిన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటి విలువ రూ. 2.5 లక్షలు ఉంటుందన్నారు. డ్రైవర్ నౌషాద్‌తోపాటు, షాపు యజమానికి అమీర్‌ను అరెస్టు చేశామన్నారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామా

పుట్టపర్తిరూరల్, ఏప్రిల్ 5: మండలంలో గ్రామ వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం కప్పలబండ గ్రామ సచివాలయ పరిధిలో ఆరుగురు వలంటీర్లు రాజీనామా చేసి పత్రాలను ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డికి అందజేశారు.

నియోజకవర్గ అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

- ఎమ్మెల్యే కేతిరెడ్డికి సవాలు విసిరిన కూటమి అభ్యర్థి సత్యకుమార్ యాదవ్
- అవినీతి చిట్టా విప్పుతానని హెచ్చరిక

ధర్మవరం, ఏప్రిల్ 5: నియోజకవర్గాన్ని ఏమి అభివృద్ధి చేశారో, ఎంత దోచుకున్నారో చర్చ పెడదామని, అందుకు మీరు సిద్ధమా అంటూ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్ ఎమ్మెల్యే కేతిరెడ్డికి సవాల్ విసిరారు. పట్టణంలోని శారదానగర్‌లో శుక్రవారం ఆయన బీజేపీ నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ... ఎమ్మెల్యే కేతిరెడ్డి అవినీతిపై ఎంత మాట్లాడుకున్నా తక్కువేనన్నారు. రూ.5100 కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి చేశానని, కేతిరెడ్డి చెప్పుకుంటున్నారని, అదంతా ఆయన కల్పితమని విమర్శించారు. భూ కబ్జాలు, అక్రమాలు చేసి పొరపాటున అభివృద్ధి అంటూ మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. నియోజకవర్గంలో ఎక్కడ రహదారులు నిర్మించారో, ఎక్కడ ఆస్పత్రిలు కట్టారో, ఎక్కడ ఏ అభివృద్ధి పనులు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే అక్రమాలను బయటపెట్టడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. నియోజకవర్గంపై పూర్తి అవగాహన వచ్చిన వెంటనే.. ప్రజలందరినీ కలుసుకుని ఎమ్మెల్యేపై చార్జిషీటు వేయడమే కాకుండా.. ఆయన దోచుకున్న వందలాది ఎకరాలనూ కక్కిస్తామన్నారు. తనను నాన్‌లోకల్ అంటున్నారని, మీ పార్టీ ఎంపీ అభ్యర్థి ఎక్కడి నుంచి వచ్చారని ప్రశ్నించారు. ధర్మవరం నియోజకవర్గ ప్రజలకు సేవకుడిగా ఉండటానికే తాను వచ్చానన్నారు. మీ కమిషన్లు, కబ్జాల బాగోతాన్ని త్వరలో ఒక్కొక్కటిగా బయటపెడతానని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల బీజేపీ అధ్యక్షులు శ్రీనివాసులు, జీఎంశేఖర్, మాజీ ఎమ్మెల్యే పార్థసారధి, టీడీపీనాయకులు కమతంకాటమయ్య, చిగిచెర్ల ఓబిరెడ్డి, ఫణికుమార్, జింకాచంద్ర,సాకే ఓబులేశు తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న సత్యకుమార్ యాదవ్

ఘనంగా బాబూ జగ్జీవన్‌రాం జయంతి

- ఆయన చిత్రపటాల వద్ద ఘన నివాళులు

కదిరి, ఏప్రిల్ 5: బడుగుబలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన మహనీయుడు బాబూ జగ్జీవన్‌రాం అని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ కొనియాడారు. పట్టణంలోని తన నివాసంలో శుక్రవారం ఆయన బాబు జగ్జీవన్‌రాం 117వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. ఉప ప్రధానిగా బాబూ జగ్జీవన్‌రామ్ దేశానికి ఎన్నో సేవలు చేశారని తెలిపారు. ఆయన ఆశయాలు అందరికీ ఆదర్శనమన్నారు. ఆ ఆశయాల సాధనకోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాజశేఖర్‌బాబు, విశ్వనాథ్, చిన్నప్ప, గంగాధర్, పీ.రాజశేఖర్, రామాంజనేయులు, కదిరప్ప, కళ్యాణ్‌కుమార్, ఆంజనేయులు, తిరుపాల్, రెడ్డెప్ప, అంజి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కదిరిఅర్బన్: పట్టణంలోని పలు పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు బాబూ జగ్జీవన్‌రాం జయంతిని ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆ పార్టీ అభ్యర్థి షానవాజ్ జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు. అలాగే ఎస్కేయూ పాలకమండలి సభ్యుడు కొమ్ము విజయభాస్కర్ స్థానిక అంబేడ్కర్ సర్కిల్లో జగ్జీవన్‌రాం చిత్రపటం ఉంచి నివాళులర్పించారు. శాంతినికేతన్ హైస్కూల్‌లో జగ్జీవన్‌రాం జయంతి వేడుకలను నిర్వహించారు.

ధర్మవరం: పట్టణంలోని యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో జగ్జీవన్‌రాం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కేక్ కట్ చేశారు. అనంతరం మాట్లాడుతూ... బడుగు, బలహీన వర్గాల వారు ఉన్నతశిఖరాలకు చేరుకున్నప్పుడే జగజ్జీవన్‌రాంకు నిజమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా ప్రధానకార్యదర్శి డాక్టర్ ఆదిశేషు, ఎస్సీ ఓసంఘం నాయకులు ఉరుకుందప్ప, ధర్మవరం జోన్ యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ ఆదేశాల మేరకు ఆయన వర్గీయులు డిష్‌రాజు, చిగిచెర్ల అరవిందరెడ్డి, తుంపర్తిపరమేశ్, దుస్సాక్రిష్ణ, రాప్తాటిరాము తదితరులు జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇక ఎమ్మార్పీఎస్ నాయకులు సిరిడిబూదెప్ప, గజ్జల రామాంజినేయులు, గజ్జల శివప్రసాద్,నారాయణ, పూజారిపెద్దన్న తదితరులు జయంతి వేడుకలను నిర్వహించారు.



కదిరిలో జగ్జీవన్‌రాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కందికుంట



ధర్మవరంలో నివాళులర్పిస్తున్న గోనుగుంట్ల వర్గీయులు

నల్లమాడలో భవిష్యత్తుకు గ్యారెంటీ



ప్రజలకు కరపత్రాలు పంచుతున్న టీడీపీ నాయకులు

నల్లమాడ, ఏప్రిల్ 5: మండలకేంద్రంలోని పాత గ్రామీణ బ్యాంక్ వీధి, చర్చి వీధిలో శుక్రవారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ప్రజలకు సూపర్‌సిక్స్ పథకాలకు సంబంధించిన కరపత్రాలు అందజేస్తూ వాటి గురించి తెలియజేశారు. ఆ పథకాలు కుటుంబంలో ఎవరెవరికి వర్తిస్తాయో.. ఏ మేరకు లబ్ధి చేకూరుతుందో వివరించారు. చంద్రబాబు సీఎం అవగానే ఆ పథకాలన్నీ అమలు చేస్తారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూరారెడ్డిని అధిక మోజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మైలే శివశంకర్, నాయకులు బుట్టి నాగభూషణనాయుడు, పాపారాయుడు, శంకర్, మైలే హరినాథ్, మైలే రమేష్, మగ్గం శంకర్, మహేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో నీటిసమస్య పరిష్కారానికి కృషి

- అసిస్టెంట్ డీఎంహెచ్ఓ నాగేంద్రనాయక్



వైద్యాధికారులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ డీఎంహెచ్ఓ

నంబులపూలకుంట, ఏప్రిల్ 5: మండలకేంద్రంలోని ప్రాథమిక వైద్యశాలలో నీటి సమస్య వేధిస్తోంది. దీనిపై పీహెచ్‌సీలో నీటిసమస్య అనే శీర్షికన శుక్రవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన అసిస్టెంట్ డీఎం హెచ్ఓ నాగేంద్రనాయక్ వెంటనే ఆస్పత్రిని సందర్శించారు. నీటి సంపును పరిశీలించి, మోటారు ఎలా చోరీ అయిందన్న దానిపై స్థానిక వైద్యాధికారులు ఆషియా, ఆనందవర్ధన్‌తో చర్చించారు. ఎన్నిరోజులుగా నీటి సమస్య నెలకుందని ఆరా తీశారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారా అని ప్రశ్నించారు. ఆస్పత్రిలో ఏ సమస్య ఉన్నా వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు. ఆసుపత్రిలో నీటి సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని నాగేంద్రనాయక్ పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి స్పందన

నాలుగు బైకులు దగ్ధం

కదిరి, ఏప్రిల్ 5: పట్టణంలోని ఎంజీరోడ్డులో గల రామాలయం వద్ద నాలుగు బైకులు దగ్ధమైనట్లు సీపీఐ నాయకుడు ఇషాక్ శుక్రవారం ఫిర్యాదు చేసినట్లు సీఐ పుల్లయ్య తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. ఎంజీరోడ్డులో రామాలయం వద్ద ఇషాక్ అనే వ్యక్తి రెండు బైక్‌లు పార్క్ చేశారు. అయితే ఆయనతో పాత కక్షలున్న శ్రీధర్ గురువారం అర్ధరాత్రి సమయంలో బైక్‌లకు నిప్పు పెట్టారన్నారు. ఈ ఘటనలో ఇషాక్ బైక్‌లతోపాటు పక్కనే ఉన్న మరో రెండు బైక్‌లు, దేవాలయం గోడలు, కిటికీలు కాలిపోయినట్లు ఫిర్యాదు అందిందన్నారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



దగ్ధమైన బైక్‌లు

అనిల్‌కుమార్‌కు కన్నీటి వీడ్కోలు

పుట్టపర్తి ఏప్రిల్ 5: సత్యసాయి బాబా ప్రసంగం ఆంగ్ల అనువాదకులు ప్రొఫెసర్ అనిల్‌కుమార్‌కు సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ తదితరులు శుక్రవారం కన్నీటి వీడ్కోలు పలికారు. సత్యసాయి జనరల్ హాస్పటల్‌లో ఉన్న అనిల్‌కుమార్ పార్థివ దేహాన్ని వారు సందర్శించి నివాళులర్పించారు. సత్యసాయితో, భక్తులతో సుమారు 40 ఏళ్ల పాటు ఆయనకు ఉన్న అనుబంధాన్ని గుర్తుకు చేసుకున్నారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి కూడా నివాళులర్పించి ఆయన సేవలు అనన్యమంటూ కొనియాడారు. తర్వాత స్థానిక అమరధామంలో దహనక్రియలు నిర్వహించారు.



అనిల్‌కుమార్ పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్జే రత్నాకర్ తదితరులు

కల్వర్టు వద్ద దెబ్బతిన్న రోడ్డు

- ఏమరుపాటుగా వెళితే అంతే సంగతి

ముదిగుబ్బ, ఏప్రిల్ 5: మండల కేంద్రం నుంచి పుట్టపర్తి వెళ్లే రహదారి మధ్యలో పాతూరు వద్ద ఉన్న కల్వర్టు దగ్గర దెబ్బతింది. అక్కడ రోడ్డు కొంత మేర కోతకు గురైంది. అయితే ఎలాంటి ప్రమాద సూచికలు లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రహదారిపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. శుక్రవారమైతే వారపు సంత ఉండడంతో మండలంలోని మంగళమడక, పూజారి తండా, రామస్వామితండా, పొడరాళ్ళపల్లి నుంచే కాకుండా బుక్కపట్నం మండలం గసికవారిపల్లి, అగ్రహారం, పాముదుర్తి, మారాల, యాదాలంకపల్లి, గూనిపల్లి గ్రామాల నుంచి సైతం ప్రజల వందలాదిగా ఇక్కడికి వస్తారు. సంతలో సరుకుల కొనుగోలు నిమిత్తం బైక్‌లు, ఆటోలు ఇతర వాహనాల్లో రాకపోకలు సాగిస్తుంటారు. అయితే దెబ్బతిన్న కల్వర్టు సమీపంలో ప్రమాద సూచికలు లేకపోవడంతో వాహనదారులకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. కల్వర్టు వద్ద రోడ్డు కొంతమేర కోసుకుపోయింది. అక్కడ ఏమరుపాటుగా వెళితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఇప్పటికే పలు ద్విచక్ర వానదారులు ప్రమాదాలకు గురై గాయాలపాలయ్యారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కల్వర్టుకు మరమ్మతులు చేయాలని, అంతవరకు ప్రమాదాలు జరగకుండా అక్కడ ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



కల్వర్టు వద్ద దెబ్బతిన్న రోడ్డు

నేటి నుంచి సమ్మేటివ్ అసెస్‌మెంట్

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 5: పాఠశాల విద్యార్థులకు శనివారం నుంచి ఈ నెల 19వ తేదీ వరకు సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు విద్యాశాఖ నుంచి ఆదేశాలు అందాయని ఎంఈఓ గంగప్ప తెలిపారు. ఆరో తరగతి నుంచి 9వ తరగతి వరకు సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షల షెడ్యూలను అన్ని పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులకు తెలియజేయాలని సూచించారు. ఆరో తరగతి నుంచి 8వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. తొమ్మిదో తరగతి విద్యార్థులకు మాత్రం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.15 వరకు పరీక్ష ఉంటుందన్నారు.

ఘనంగా నాగదేవత విగ్రహ ప్రతిష్ఠ



నాగదేవత విగ్రహాన్ని ప్రతిష్ఠించిన దృశ్యం

గోరంట్ల, ఏప్రిల్ 5: పట్టణంలోని బస్టాండ్ కూడలిలో నాగదేవత విగ్రహ ప్రతిష్ఠను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అనాది నుంచి స్థానికులు నాగదేవతను గ్రామదేవతగా భావించి పూజలు చేసేవారు. కాలక్రమేణ రోడ్డు విస్తరణలతో బస్టాండ్ కూడలి పట్టణం మధ్యలోకి వచ్చేసింది. అయినా ఇక్కడి నాగదేవతను స్థానికులు భక్తితో ఆరాధించేవారు. అయితే ఇటీవల రాత్రి వేళ గుర్తుతెలియని వాహనాల పలుమార్లు ఢీకొనడంతో నాగదేవత కట్ట శిథిలావస్థకు చేరింది. దీంతో స్పందించిన స్థానికులు చందాలు సేకరించి రూ.50వేల వ్యయంతో రాతి దిమ్మెను, నూతన విగ్రహాన్ని ఆళ్లగడ్డ నుంచి తీసుకొచ్చారు. పురోహితులు భాస్కర్‌తారానాథ్‌శర్మ, మేషనాథశర్మ ఆధ్వర్యంలో వేదమంత్రోఛ్ఛరణలతో ప్రాణ ప్రతిష్ఠ చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ ప్రాంతానికి సుబ్రహ్మణేశ్వరస్వామి సర్కిల్‌గా నామకరణం చేశారు. పట్టణానికి చెందిన వెంకటరెడ్డి, మణికంఠ, ఆనంద్, బోలేరా శీనా, మురళి, శబరీష్, సుకుమార్, పలువురు ఉపాధ్యాయులు సహాయ, సహకారాలు అందించారు.

నేత్రదానం

లేపాక్షి, ఏప్రిల్ 5 : అన్నిదానలలో కన్నా నేత్రదానం మహా గొప్పదని పలువురు పేర్కొన్నారు. మండల కేంద్రమైన లేపాక్షికి చెందిన చాకలి గంగమ్మ (60) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందింది. ఈ విషయాన్ని లేపాక్షి గ్రామంలో ఉన్న ఆశ్రయ సేవా ట్రస్టు వారు బెంగళూరు నారాయణ నేత్రాలయకు సమాచారం అందించారు. వెంటనే సిబ్బంది వచ్చి ఆమె రెండు నేత్రాలను తీసుకెళ్లారు. ఆమె చనిపోయిన మరో ఇద్దరికి కంటి చూపు ప్రసాదించిందని పలువురు ప్రశంసించారు.

నేడు 'మడకశిర పిలుస్తోంది'

రొళ్ల, ఏప్రిల్ 5: మండలంలోని హొట్టేబెట్ట గ్రామం నుంచి జీరిగేపల్లి వరకు శనివారం కాంగ్రెస్ పార్టీ తరపున చేపట్టే మళ్లీ మన మడకశిర పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ డాక్టర్ గౌడప్ప, నాయకులు మల్లప్ప శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కే సుధాకర్ హాజరు కానున్నట్లు తెలిపారు. కావున కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు పావగడకు గోవిందకార్జోళ రాక

పావగడ, ఏప్రిల్ 5: బీజేపీ చిత్రదుర్గం పార్లమెంటు అభ్యర్థి, మాజీ ఉప ముఖ్యమంత్రి గోవిందకార్జోళ శనివారం పావగడకు రానున్నారు. ఈ నెల 26న జరిగే పార్లమెంటు ఎన్నికల ప్రచారానికి ఆయన వస్తున్నారు. తాలూకాలోని బీజేపీ, జేడీఎస్ నేతలతో కలిసి ఆయన చర్చించనున్నట్లు బీజేపీ తాలూకా అధ్యక్షుడు రంగన్న శుక్రవారం ఓ ప్రకటనలో తెలియజేశారు.

కారు, ద్విచక్రవాహనం ఢీ - వ్యక్తి మృతి

మడకశిర రూరల్, ఏప్రిల్ 5 : మండలంలో అయ్యవారిపల్లి మలుపు వద్ద శుక్రవారం కారు, ద్విచక్రవాహనం ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో బాబాబుడేన్ (45) అనే వ్యక్తి అక్కడక్కడే మృతిచెం దాడు. మండలపరిధిలోని బీ రాయపురానికి చెందిన బాబాబుడేన్ మధ్యాహ్నం గ్రామ నుంచి ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. ప్రధాన రహదారి గుండా మడకశిరకు వస్తున్నాడు. అదే మార్గంలో హిందూపురం నుంచి మడకశిరకు వెళ్తున్న ఇన్నోవా కారు అయ్యవారిపల్లి మలుపు వద్ద ఢీ కొంది. దీంతో బాబాబుడేన్ అక్కడక్కడే మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయాన్ని బంధువులకు సమాచారం అందించినట్లు తెలిపారు. స్థానికులు, బంధువుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

మిద్దెపై నుంచి పడి యువకుడికి గాయాలు

గోరంట్ల, ఏప్రిల్ 5: మండలంలోని పాలసముద్రం గ్రామానికి చెందిన ఓంకార్ అనే యువకుడు శుక్రవారం మిద్దెపై నుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామానికి చెందిన రాము కుమారుడైన ఓంకార్ వేసవి ఉక్కపోతను భరించలేక గురువారం రాత్రి మిద్దెపై నిద్రించాడు. అతడు శుక్రవారం తెల్లవారుజామున 3గంటల సమయంలో మూత్రవిసర్జన కోసం లేచాడు. పైన చుంచు గోడ లేకపోవడంతో నిద్ర మత్తులో మిద్దెపై నుంచి కిందపడ్డాడు. తలకు బలమైన గాయాలు కావడంతో కుటుంబీకులు అతడిని గోరంట్ల ప్రభుత్వా సుపత్రికి తరలించగా, అక్కడ వైద్యులు చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం 108లో హిందూపురం తరించారు.

చోరీ అయిన ఆటో లభ్యం

గోరంట్ల, ఏప్రిల్ 5: పట్టణంలోని బాలికల ఉన్నపాఠశాల వెనుక వీధిలో గురువారం చోరీ అయిన ఆటోను పోలీసులు శుక్రవారం గుర్తించారు. అక్కడ నివాసముంటున్న శివకుమార్ ఇంటి ఎదుట ఉంచిన ఆటోను దుండగలు చోరీ చేయగా, బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. చోరీకి గురైన ఆటో కర్ణాటకలోని బాగేపల్లిలో ఉన్నట్లు సమాచారం అందుకున్న శివకుమార్, పోలీసుల సహకారంతో వెళ్లి స్వాధీనం చేసుకున్నాడు. చిలమత్తూరు మండలానికి చెందిన ఓ వ్యక్తి తన ఆటోచోరీకి పాల్పడ్డాడని, స్వాధీన సమయానికి ఆటోబ్యాటరీని ఇతరులకు విక్రయించినట్లు బాధితుడు తెలిపాడు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి

● వైసీపీది దుర్మార్గపు పాలన
● టీడీపీ ఎంపీ అభ్యర్థి బీకే, ఎమ్మెల్యే అభ్యర్థి సవిత



కొలిమిపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న బీకే పార్థసారథి, సవిత

గోరంట్ల, ఏప్రిల్ 5: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీతోనే సాధ్యమని టీడీపీ కూటమి పురం ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి, పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత పేర్కొన్నారు. వారు శుక్రవారం మండలంలోని వానవోలు పంచాయతీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మొదట గోరంట్లలోని టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ పరిశీలకులు నరసింహారావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు బీవీ వెంకటరాముడుతో కలిసి జగ్జీవన్‌రాం జయంతిని నిర్వహించారు. అనంతరం పట్టణంలోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి, ప్రచారం ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో టీడీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి కారణంగానే జిల్లాకు కియ పరిశ్రమ వచ్చి, అనేకమందికి ఉపాధి అవకాశాలు లభించాయన్నారు. మండలంలోని నాసిన్, బెల్ పరిశ్రమలను తీసుకొచ్చిన ఘనత చంద్రబాబుదే అన్నారు. ఒక్క అవకాశమంటూ గత ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ ఎలాంటి దుర్మార్గపు పాలన సాగిస్తున్నారో అందరికీ తెలిసిందే అన్నారు. అలాగే నియోజకవర్గానికి వలస పక్షులు వచ్చి ఎన్నికల్లో గెలిచి, దోచుకుని వెళ్లిన మాట వాస్తవం కాదా అన్నారు. తాము ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామన్నారు. కార్యక్రమంలో పరిశీలకులు నరసింహారావు, జిల్లా అధ్యక్షుడు బీవీ వెంకటరాముడు, మండలకన్వీనర్ సోముశేఖర్, నాయకులు కొత్తపల్లి నరసింహప్ప, బెల్లాల చెరువు చంద్ర, అశ్వత్థరెడ్డి, సుబ్రహ్మణ్యం, కక్కల రఘునాథ్‌రెడ్డి, నిమ్మల శ్రీధర్, జనసేన సంతోష్, సురేష్ వెంకటేష్, బాలక్రిష్ణచౌదరి, జిలాని, రవినాయక్, నరసింహులు, రెడ్డెప్ప, రాఘవనాయుడు, ఆంజనేయులు, ఉత్తమరెడ్డి తదితరులున్నారు.

బీసీల ద్రోహి సీఎం జగన్

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్



జయహో బీసీ సదస్సులో మాట్లాడుతున్న సునీల్‌కుమార్

అగళి, ఏప్రిల్ 5 : రాష్ట్రంలో బీసీల ద్రోహి ఎవరైనా ఉన్నారంటే... అది ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డే అని టీడీపీ కూటమి అభ్యర్థి సునీల్‌కుమార్ పేర్కొన్నారు. అగళి మండల కేంద్రంలోని ఆర్కే కల్యాణ మండపంలో శుక్రవారం జయహో బీసీ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సునీల్‌తో పాటు మాజీ ఎమ్మెల్యే ఈరన్న రాష్ట్ర, కుంచిటిగ వక్కలిగ సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు వీఎం పాండురంగప్ప హాజరయ్యారు. మండల కన్వీనర్ కుమారస్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అభ్యర్థి సునీల్ మాట్లాడుతూ... వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీసీలకు రక్షణ కరువైందన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు బీసీలకు అధిక ప్రాధాన్యమిచ్చి అభివృద్ధి దిశగా తీసుకెళ్లారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో చంద్రబాబు బీసీలకు 34శాతం రిజర్వేషన్ కల్పిస్తే దానిని 24శాతానికి తగ్గించింది ఈ దరిద్రపు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డే అన్నారు. పాండురంగప్ప మాట్లాడుతూ..... టీడీపీ ప్రారంభించినప్పటి నుంచి నేటి వరకు బీసీలకు అధిక ప్రాధాన్యం కల్పించారన్నారు. అనంతరం అగళి, ఎంఎం పాళెం, రామాపురం, ఇరిగేపల్లి, నందరాజునపల్లి, గొల్లహట్టి గ్రామాలలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. మాజీ జడ్పీటీసీ నరసింహమూర్తి, నాయకులు రామక్రిష్ణ యాదవ్, తిమ్మేగౌడ్, మాజీ ఎంపీపీలు, ఆదినారాయణ, అశ్వత్థరామప్ప, రామక్రిష్ణ, రామాంజనేయులు, రంగనాథ్, కిష్టప్ప, నాగోజీ, చక్రప్ప, దినేష్, కేతప్ప, భీమరాజ్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అనాథ విద్యార్థులకు చేయూత

పావగడ, ఏప్రిల్ 5: తాలూకాలోని దేవరబెట్ట గ్రామంలో తల్లిదండ్రులను కోల్పోయి అవ్వ పంచన పెరుగుతూ చదువుకుంటున్న ముగ్గురు పేద విద్యార్థులకు హెల్ప్ సొసైటీ సభ్యులు చేయూతనందించారు. ఒకటో తరగతి చదువుతున్న మనూ, నాలుగో తరగతి రాజేష్, ఎనిమిదో తరగతి దర్శన్ చదువుకు అవసరమైన పుస్తకాలు, యూనిఫాంను సొసైటీ సభ్యులు శుక్రవారం అందజేసి మానవత్వానికి నిదర్శనంగా నిలిచారు. ఆ పిల్లలకు అండగా నిలిచిన హెల్ప్ సొసైటీ అధ్యక్షుడు మానం శశికిరణ్‌కు ఎంతో రుణపడి ఉంటామని వారి అవ్వ తెలిపింది. కరోనా సమయంలో తల్లిదండ్రులను కోల్పోయినప్పటి నుంచి కూలీ పనులు చేస్తూ వారి ఆలనా, పాలనా చూస్తున్నానని ఆమె తెలిపింది. తన ఇంటికి తలుపులు లేకపోవడంతో సొసైటీ వారు వాటిని కూడా సమకూర్చి ఎంతో సహాయపడ్డారని తెలిపింది. త్వరలోనే వారికి ఉగాది కిట్లు అందజేయనున్నట్లు మానం శశికిరణ్, వాల్మీకి జాగృతి వేదిక అధ్యక్షుడు పాళేగార్ లోకేష్ తెలియజేశారు.

వైసీపీ నాయకుడిపై దాడి

తీవ్రంగా ఖండించిన ఆర్యవైశ్యులు

హిందూపురం, ఏప్రిల్ 5: వైసీపీకి చెందిన కార్తీక్ అనే వ్యక్తిపై అదే పార్టీకి చెందిన కొంత మంది శుక్రవారం రాత్రి దాడిచేశారు. పట్టణానికి చెందిన వైసీపీ నాయకుడు కార్తీక్ ఇక్బాల్‌కు దగ్గరగా ఉండేవాడు. అతడు 25వ వార్డు కౌన్సిలర్‌గా పోటీ చేసి ఓడి పోయాడు. అయినా ఆ వార్డు ఇన్‌చార్జ్‌గా కొనసాగుతుండేవాడు. కానీ ఇక్బాల్ ఇక్కడ నుంచి వెళ్లిపోవడం, దీపిక వైసీపీ ఇన్‌చార్జ్‌గా రావడంతో వార్డు ఇన్‌చార్జ్‌గా ఉన్న కార్తీక్‌ను తొలగించారు. అయితే అతడు అధికార పార్టీలోనే కొనసాగుతున్నాడు. కానీ వైసీపీకి ఇక్బాల్ రాజీనామా చేయడంతో టపాసులు కాల్చి మద్దతు తెలిపాడు. అదే పార్టీకి చెందిన వైసీపీ యువనేత వద్ద ఉన్న అనుచరులు ఫోన్ చేసి టపాసులు ఎందుకు కాల్చావని బెదిరించినట్లు సమాచారం. ఈ సందర్భంలో ఫోన్‌లో మాటా మాటా పెరిగింది. దీంతో కార్తీక్‌ను ఎక్కడున్నావని అడిగారు. పట్టణంలోని పీడీ రోడ్డులో ఉన్నానని చెప్పగా వైసీపీ యువనాయకుడి అనుచరులు అక్కడకు చేరుకుని కార్తీక్‌పై విచక్షారహితంగా దాడి చేసి గాయపరిచారు. స్థానికులు కార్తీక్‌ను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ దాడిలో ఆ యువనాయకుడు కూడా ఉన్నట్లు స్థానికుల ద్వారా తెలుస్తోంది. కార్తీక్ ఆర్యవైశ్య కులానికి చెందిన వాడు కావడంతో ఆర్యవైశ్యులు తీవ్రంగా ఖండించారు. టూటౌన్ పోలీసులు ఘటనపై ఆరా తీశారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ కన్జక్షన్ తెలిపారు.

నిమ్మలకు బుజ్జగింపులు



నిమ్మల కిష్టప్పతో చర్చిస్తున్న టీడీపీ జిల్లా ముఖ్య నాయకులు

గోరంట్ల, ఏప్రిల్ 5: ఎన్నికలు పార్టీ వ్యవహారాల పట్ల అసంతృప్తితో దూరంగా ఉంటున్న మాజీ ఎంపీ, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నిమ్మల కిష్టప్పను టీడీపీ జిల్లా ముఖ్య నాయకులు శుక్రవారం చర్చల ద్వారా బుజ్జగించే ప్రయత్నం చేశారు. ఆయన ఆశించిన పుట్టపర్తి అసెంబ్లీ టిక్కెట్ రాకపోవడంతో ఆయన అసంతృప్తితో పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. దీంతో పార్టీ అధిష్ఠానం ఆదేశం మేరకు టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు నరసింహారావు, జిల్లా అధ్యక్షుడు బీవీ వెంకటరాముడు, ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి, ఎమ్మెల్యే అభ్యర్థి సవిత శుక్రవారం నిమ్మల నివాసానికి వెళ్లారు. ఆయనతో గంటపాటు చర్చించారు. తన 40యేళ్ల రాజకీయ అనుభవంతో రెండుమార్లు మంత్రిగాను, రెండు మార్లు ఎంపీగాను, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా యేనలేని సేవలందించారన్నారు. అలాంటి తమరి సేవలు పార్టీకి ఎంతో అవసరమన్నారు. చేనేత వర్గానికి చెందిన తమరు కీలకవ్యక్తి కావడంతో, పార్టీ అధికారంలోకి వస్తే తమకు మంచి రాజకీయ భవిష్యత్తు ఉంటుందని నిమ్మలకు సర్ది చెప్పారు.

సైబీరియన్ పక్షులకు తాగునీటి వసతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



వీరాపురం చెరువులో నీటి వసతి ఏర్పాటుచేస్తున్న అటవీ శాఖాధికారులు

చిలమత్తూరు, ఏప్రిల్ 5: సైబీరియన్ నుంచి వీరాపురం వచ్చిన వలస పక్షులకు అటవీ శాఖాధికారులు తాగునీటి వసతులు ఏర్పాటు చేశారు. వాటికి తాగునీరు తదితర సౌకర్యాలు కరవయ్యాయన్న విషయంపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో శుక్రవారం 'సైబీరియన్ అతిథుల ఉనికికి ఎసరు' అనే కథనం వెలువడిన విషయం విదితమే. ఈ కథనానికి అటవీ శాఖ అధికారులు స్పందించారు. దాహంతో అల్లాడుతున్న వలస పక్షులకు తాత్కాలికంగా తాగునీటి వసతులు కల్పించారు. జిల్లా అటవీశాఖ అధికారుల ఆదేశాలతో ఎఫ్ఎస్ఓ అక్బర్, గార్డ్ సుధాకర్‌బాబు, ఏబీఓ కేశవ్ప పక్షుల కోసం నీటి తొట్టెలను ఏర్పాటుచేసి, ట్యాంకర్లతో నీటిని వదిలారు. పక్షులకు తాగునీటి ఇబ్బందులు ఉండటంతో అవి సుదూర ప్రాంతాలకు వెళుతున్నాయని, ఉన్నతాధికారుల ఆదేశాలతో తాత్కాలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. పక్షులకు వేసవిలో తాగునీటి సమస్య రాకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వారు తెలిపారు.

నాలుగు బైకులు దగ్ధం



దగ్ధమైన బైక్‌లు

కదిరి, ఏప్రిల్ 5: పట్టణంలోని ఎంజీరోడ్డులో గల రామాలయం వద్ద నాలుగు బైకు లు దగ్ధమైనట్లు సీపీఐ నాయకుడు ఇషాక్ శుక్రవారం ఫిర్యాదు చేసినట్లు సీఐ పుల్లయ్య తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. ఎంజీరోడ్డులో రామాలయం వద్ద ఇషాక్ అనే వ్యక్తి రెండు బైక్‌లు పార్క్ చేశారు. అయితే ఆయనతో పాత కక్షలున్న శ్రీధర్ గురువారం అర్ధరాత్రి సమయంలో బైక్‌లకు నిప్పు పెట్టారన్నారు. ఈ ఘటనలో ఇషాక్ బైక్‌లతోపాటు పక్కనే ఉన్న మరో రెండు బైక్‌లు, దేవాలయం గోడలు, కిటికీలు కాలిపోయినట్లు ఫిర్యాదు అందిందన్నారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న అధికారులు



గోరంట్లలో నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ నాయకులు

జగ్జీవన్‌రాం బాటలో పయనిద్దాం

జయంతి కార్యక్రమంలో వక్తలు

(ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్)

స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త, రాజకీయవేత్త, వెనుకబడిన వర్గాల ఆశాజ్యోతి, మాజీ ప్రధాని బాబూ జగ్జీవన్ రాం అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ పయనించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాలతో పాటు వివిధ పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయంలో బాబూ జగ్జీవన్‌రాం జయంతిని ఘనంగా నిర్వహించారు. అధికారులు ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన దేశానికి చేసిన సేవలు, ఘనకీర్తిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వంశీకృష్ణభార్గవ్, తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.



పావగడలో నివాళులర్పిస్తున్న తహసీల్దార్ సంతోష్‌కుమార్, సిబ్బంది



పెనుకొండలో నివాళులర్పిస్తున్న దళిత, ఉద్యోగ, ప్రజాసంఘాల నాయకులు



నివాళులర్పిస్తున్న న్యాయవాదులు



బహుజన చైతన్యవేదిక నాయకులు

టీడీపీతోనే మైనార్టీలకు మేలు



వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన ముస్లిం మైనార్టీలతో టీడీపీ నాయకులు

చిలమత్తూరు, ఏప్రిల్ 5: టీడీపీతోనే మైనార్టీలకు మేలు జరుగుతుందని టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం 200 మంది ముస్లిం మైనార్టీలు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు. ఆయన వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. నాయకులు దేమకేతేపల్లి అంజనప్ప, బేవనహళ్లి ఆనంద్, మండల కన్వీనర్ రంగారెడ్డి, శ్రీదేవి, నందీషప్ప తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్ రామ్ ఆశయాలను కొనసాగిద్దాం

సమర్థుడైన పాలకుడుగా పేరొందిన బాబూ జగ్జీవన్ రామ్ ఆశయాలను కొనసాగిద్దామని టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, మండల కన్వీనర్ రంగారెడ్డి, ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి బేకరీ గంగాధర్, శ్రీదేవి పేర్కొన్నారు. వారు శుక్రవారం మండలంలోని కోడూరు పంచాయతీలో చిన్నప్ప రెడ్డిపల్లి, కోట్లోపల్లిల్లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ముందుగా చిన్నప్ప రెడ్డిపల్లిలో జగ్జీవన్ రామ్ చిత్రప టానికి పూలమాలవేసి పార్టీ శ్రేణులతో కలిసి ఘనంగా నివాళులర్పించారు. మాజీ ఎంపీటీసీలు సూర్యనారాయణ, ప్రవీణ్, మీసేవ సూరి, నంజుండప్ప, గంగాధర, వెంకటేశులు, రిజ్వాన్, వెంకటసుబ్బ య్య, హోటల్ చంద్ర, నారాయణప్ప, శ్రీరామప్ప తదితరులు పాల్గొన్నారు

అరాచక పాలనను అంతమొందిద్దాం : టీడీపీ



చలివెందలలో ప్రచారంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 5: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలన ను అంతమొందించాలని టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు. పట్టణ పరిధిలోని 7వ వార్డు, రూరల్ మండలంలోని చలివెందల గ్రామంలో టీడీపీ నాయకులు శుక్రవారం సూపర్‌సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. మహిళా సంక్షేమమే ధ్యేయంగా టీడీపీ ముందుకెళ్తుందన్నారు. ఏడో వార్డులో టీడీపీ పట్టణాధ్యక్షుడు డీఈ రమేష్‌కుమార్, నాయకులు అమర్‌నాథ్, అంజాద్, డైమండ్‌బాబా తదితరులు పాల్గొన్నారు. చలివెందలలో మండల కన్వీనర్ అశ్వత్థరెడ్డి, నాయకులు బేవనహళ్ళి ఆనంద్, నాగరాజు, ఆదినారాయణ, హెచ్ ఎన్‌రాము, మంజునాథ్, రామకృష్ణారెడ్డి, హనుమంతు, తదితరులు ఉన్నారు.

వీటికి కోడ్ వర్తించదా..?



కల్లుమర్రి హాస్టల్ అవరణలో పడేసిన జగనన్న భూరక్ష 2020 సర్వేరాళ్లు

మడకశిర రూరల్, ఏప్రిల్ 5 : పార్టీ జెండాలు రంగులు,నాయకుల విగ్రహాలు,గుర్తులు పేర్లు ఇలా ఓటర్లను ప్రభావితం చేసేవి ఏవీ బహిరంగంగా కనిపించకూడదని ఎన్నికల సంఘం నిర్దిష్టంగా ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికి కొంత మంది అధికారులు బహిరంగ ప్రదేశాల్లో కనిపిస్తున్నా నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నరన్నా ఆరోపణలు ప్రజల నుంచి వస్తున్నాయి. మండలంలోని కల్లుమర్రి గ్రామంలో రోడ్డు ప్రక్కన ఉన్న బీసీ హాస్టల్ ఆవరణంలో సర్వేరాళ్లు నిలువ ఉంచ్చారు వాటిపై వైఎస్సార్ జగనన్న భూరక్ష 2020 అని అన్నింటిపై ఉంది. భూముల సర్వే అనంతరం మిగిలిని సర్వేరాళ్ల అక్కడ ఉంచ్చారు. పేర్లులు కనిపిస్తున్నా అధికారులు పట్టించుకోలేదు.

సమస్యాత్మక గ్రామాల్లో పోలీసుల కవాతు



చిలమత్తూరులో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

చిలమత్తూరు, ఏప్రిల్ 5: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో పోలీసులు కవాతు చేపట్టారు. మండలంలోని వీరాపురం, పాతచామలపల్లిల్లో శుక్రవారం పోలీసులు కవాతు నిర్వహించారు. హిందూపురం రూరల్ సీఐ ఈరన్న, ఎస్ఐ గంగాధర్, 131 బెటాలియన్ పోలీసులు, బీఎస్ఎఫ్ అధికారులు కలిసి కవాతు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ గంగాధర్ మాట్లాడుతూ... ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రధానంగా సమస్యాత్మక గ్రామాల్లో పోలీసులు కవాతు చేపట్టి, అల్లరి మూకలకు హెచ్చరికలు జారీ చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సందర్భంగా గతంలో అల్లర్లకు పాల్పడిన వారిని బైండోవర్ చేసి వారిని పోలీసుల నిఘాలో ఉండేవిధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. లోక్‌సభ, శాసనసభ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అనిల్‌కుమార్‌కు కన్నీటి వీడ్కోలు



అనిల్‌కుమార్ పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్జే రత్నాకర్ తదితరులు

పుట్టపర్తి ఏప్రిల్ 5: సత్యసాయి బాబా ప్రసంగం ఆంగ్ల అనువాదకులు ప్రొఫెసర్ అనిల్‌కుమార్‌కు సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ తదితరులు శుక్రవారం కన్నీటి వీడ్కోలు పలికారు. సత్యసాయి జనరల్ హాస్పిటల్‌లో ఉన్న అనిల్‌కుమార్ పార్థివ దేహాన్ని వారు సందర్శించి నివాళులర్పించారు. సత్యసాయితో, భక్తులతో సుమారు 40 ఏళ్ల పాటు ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. తర్వాత స్థానిక అమరధామంలో దహనక్రియలు నిర్వహించారు.